సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం | 8 | ఆగస్టు | 2025



రూ.50,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పల్లపోతు నాగేశ్వరరావు (లక్కవరం) రూ.50,116 విరాళం సమర్పించారు.



ప్రయాణం.. ప్రయాసం

రెండు జిల్లాల మధ్య గోదావరి నదిపై గల దిండి – చించినాడ వంతెనపై రాకపోకలు నిషేధించిన ప్రభుత్వం ప్రయాణికులకు తగిన ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమైంది. - 8లో

కడలిలోకి 1.16 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 1,16,989 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 5 వేలు, మధ్య డెల్టాకు 2,700, పశ్చిమ డెల్టాకు 7 వేలు కలిపి మొత్తం 14,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడికి ఖండన



శివకుమార్

సఖినేటిపల్లి: పులివెందులలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాల దాడిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ నాయకుడు, మాజీ నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సఖినేటిపల్లిలో ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనలో ఆయన ప్రయాణిస్తున్న కారును ధ్వంసం చేసి, తీవ్రంగా గాయపర్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని బలహీనవర్గానికి చెందిన ప్రజాప్రతినిధిపై దాడిగా పేర్కొంటూ, యావత్ బీసీ కులాలపై జరిగిన దాడిలా భావిస్తున్నట్టు వెల్లడించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

అన్న ప్రసాద భవనానికి రూ.1.5 లక్షల విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందచేస్తున్న డీసీ అండ్ ఈఓ చక్రధరరావు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. దానిలో భాగంగా కాకినాడకు చెందిన వేల్పూరు మురళీసురేష్ – భువనేశ్వరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు గురువారం స్వామివారిని దర్శించుకుని, వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.1,50,116 అందజేశారు. రావులపాలేనికి చెందిన మల్లిడి నాగ వెంకటఫణికుమార్‌రెడ్డి – శ్రీలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.27,000 విరాళంగా సమర్పించారు. దాతలకు దేవదాయ – ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

నదీపాయలో పడి మత్స్యకారుడి మృతి

అల్లవరం: మండలంలోని ఎస్.రామేశ్వరంలో నదీ పాయలో చేపల వేట సాగిస్తూ కొప్పాడి మహేష్ (36) ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. అల్లవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామానికి చెందిన మహేష్ తన భార్య పుట్టింట్లో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. బుధవారం ఉదయం భార్యతో చెప్పి చేపల వేటకు వెళ్లాడు. ఎస్.రామేశ్వరం బ్రిడ్జికి సమీపంలో నది పాయలో చేపల వేట సాగిస్తుండగా ప్రమాదవశాత్తూ పడి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంపత్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని నదీపాయలో ఉన్న మహేష్ మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చి పోస్టుమార్టం కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సంపత్‌కుమార్ గురువారం తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సాంకేతికతతో గిరిజన సంస్కృతి పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: మౌఖిక రూపంలో ఉండే అపారమైన గిరిజన సాహిత్య, సంస్కృతీ సంపదను సాంకేతిక పరిజ్ఞానంతో పరిరక్షించుకుంటూ భావి తరాలకు అందించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. వర్సిటీలో ఎన్ఎస్ఎస్ విభాగం సహకారంతో ఎస్సీ, ఎస్టీ సెల్, కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యాన ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ, 'స్థానిక ప్రజల కృత్రిమ మేధస్సు – హక్కులను కాపాడుకోవడం, భవిష్యత్తును రూపొందించడం'అనే థీమ్‌తో ప్రపంచ గిరిజన దినోత్సవం జరుగుతుందని అన్నారు. 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించడంలో తన 35 ఏళ్ల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలపై అవగాహన కలిగి ఉండటం ఆనందంగా ఉందని చెప్పారు. గిరిజనులు వాడుక భాషలో సాహిత్య సేద్యం చేస్తున్నారన్నారు. రాయిలో కూడా దేవుడిని చూడగలిగే నిర్మలమైన మనస్సున్న వారు గిరిపుత్రులని ప్రసన్నశ్రీ అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, సదస్సు కన్వీనర్ పి.వి జయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నోటిఫై చేస్తేనే లాభసాటి

- కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటగా కోకోకు అదనపు ఆదాయం
- ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో సాగు
- ఒక కంపెనీ కొనుగోళ్ల వల్ల రైతులకు దక్కని గిట్టుబాటు ధర
- ఉద్యాన పంటగా నోటిఫై చెయ్యని రాష్ట్ర ప్రభుత్వం
- పంట నష్టపోతే రైతుకు దక్కని బీమా.. నష్ట పరిహారం
- కనీస మద్దతు ధర ప్రకటించలేని పరిస్థితి



కొబ్బరిలో అంతర పంటగా కోకో

సాక్షి, అమలాపురం: కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలలో అంతర పంటగా... అదనపు ఆదాయాన్ని ఇచ్చేదిగా.. అధికంగా ఆకురాల్చే గుణంతో తోటల్లో టన్నుల కొద్దీ సేంద్రియ కర్బనాన్ని అందిస్తూ కోకో సాగు రైతులకు కాసుల వర్షం కురిపించాల్సి ఉంది. కాని అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా కోకో గింజలకు ధర దక్కక పోవడం, పంటల బీమా ధీమా లేకపోవడం, పంట నష్టపోతే పెట్టుబడి రాయితీ అందక రైతులు నష్టపోయే పంటగా కోకోకు ముద్రపడి పోయింది. ఉద్యాన పంటలలో లాభసాటి పంటగా ఉండాల్సిన కోకో పంటను రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేయకపోవడంతో ఇది నష్టాల పంటగా మారిపోతోంది.

కోనసీమ గింజలకు అంతర్జాతీయ డిమాండ్

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో కోకో పంట ప్రధాన ఉద్యాన పంటలలో ఒకటిగా మారింది. ఈ రెండు జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా రైతులు కోకోను సాగు చేస్తున్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలో సుమారు 15 వేల ఎకరాల్లో కోకోను సాగు చేస్తున్నారని అంచనా. ప్రపంచంలో నాణ్యమైన గింజలను ఉత్పత్తి చేసే గనా దేశం కన్నా మేలైన గింజలను గోదావరి జిల్లాల రైతులు ఉత్పత్తి చేస్తున్నారు. మరీ ముఖ్యంగా కోనసీమ జిల్లాలో తయారయ్యే గింజకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంది.

ఎకరాకు దిగుబడి ఏడాదికి రెండు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు ఉంటుంది. కొబ్బరికి ఇటు ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు కోకో మీద ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.1.60 లక్షల వరకు అదనపు ఆదాయం వస్తోంది. పెట్టుబడులు పోను ఏడాదికి రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం పొందుతున్నారు. రెండేళ్ల క్రితం ధర కేజీ రూ.900 వరకు చేరింది ఆ తర్వాత తగ్గుతూ పెరుగుతూ వస్తోంది. అంతకుముందు రూ.160 నుంచి రూ.240 వరకు ఉండేది. ఇటీవల కాలంలో గింజల ధర రూ.400కు తగ్గకపోవడం రైతులకు ఊరట ఇచ్చే అంశం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న ధర స్థానిక రైతులకు ఎలా ఇస్తారని కొనుగోలుదారులు చెబుతున్నా ఇప్పుడున్న డిమాండ్‌కు అనుగుణంగా కేజీ గింజలకు గాను కనీసం రూ.500 నుంచి రూ.550 ధర ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

నోటిఫై చేయకపోవడం వల్లే

కోకో సాగు విస్తీర్ణం పెంచేందుకు ఉద్యాన శాఖ పలు రాయితీలు ఇస్తోంది. ఏరియా ఎక్స్‌పెన్షన్, ఎరువులు అందజేయడం చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో గింజలు ఎండబెట్టేందుకు, నాణ్యమైన గింజల ఉత్పత్తికి డ్రైయర్ల ఏర్పాటు కూడా చేసేందుకు సన్నహాలు చేస్తోంది. అయితే ఈ పంటను ఉద్యాన పంటగా నోటిఫై చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోంది. గత కొన్నేళ్లుగా రైతులు కోరుతున్నా ఫలితం లేకుండా ఉంది. దీనిని ఉద్యాన పంటగా నోటిఫై చేయకపోవడం వల్ల రైతులు పలు విధాలుగా నష్టపోతున్నారు.



కోకో గింజలు

ప్రైవేట్ కంపెనీ గుత్తాధిపత్యం

ఉద్యాన పంటగా నోటిఫై చేసి కేంద్రానికి సిఫారసు చేస్తే కేంద్ర ప్రభుత్వం పలు రకాల పంటలకు ఇస్తున్నట్టుగానే కోకో గింజలకు సైతం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటిస్తుంది. ఏటా ఉత్పత్తి వ్యయాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచుతున్న విషయం తెలిసిందే. ఉద్యాన పంటలైన కొబ్బరి, ఆయిల్‌పామ్‌కు ఎంఎస్‌పీ ఉంది. కనీస మద్దతు ధర లేనందున ప్రైవేట్ కంపెనీలు కోకో గింజల ధరలు ఇష్టానుసారంగా నిర్ణయిస్తున్నాయి. గోదావరి జిల్లాలో గింజలను కేవలం ఒక ప్రైవేట్ కంపెనీ మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో ధరల విషయంలో వారిది గుత్తాధిపత్యంగా మారింది.

వర్తించని బీమా

కోకో పంటకు బీమా వర్తించడం లేదు. కొబ్బరి, ఆయిల్ పామ్, అరటి, ఇతర ఉద్యాన పంటలకు బీమా ఉంది. కాని కోకోకు బీమా వర్తించడం లేదు. ఈ పంట ఎక్కువగా కోస్తా తీరంలోనే ఉంది. తుపాన్లు, లంక గ్రామాల్లో గోదావరి వరదల వల్ల పంట నష్టపోతే రైతులకు బీమా పరిహారం అందే అవకాశం లేదు. దీనివల్ల రైతులకు సాగు భరోసా లేకుండా పోతోంది. బీమా సౌకర్యం కల్పించాలంటే తప్పనిసరిగా ఈ పంటను ఉద్యాన పంటగా నోటిఫై చేయాల్సిందే.

పెట్టుబడి రాయితీ లేదు

పంట నష్టపోయిన సమయంలో రైతులకు ప్రభుత్వం అందించే పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) రావడం లేదు. మిగిలిన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఉన్న విషయం తెలిసిందే. కోనసీమ జిల్లాలో భారీ వర్షాలకు వరి, వరదల వల్ల అరటి, కొబ్బరి, కంద, కూరగాయ పంటలు, పువ్వులు, పండ్ల తోటలకు వస్తున్నట్టు కోకో పంటకు పెట్టుబడి రాయితీ రావడం లేదు. ఉద్యాన పంటగా నోటిఫై చేయకుండా కోకో సాగు విస్తీర్ణం కోసం అరకొర రాయితీలు ఇస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు చెబుతున్నారు. రైతులకు పలు రకాల ప్రయోజనాలు అందే ఈ పంట సాగు విస్తీర్ణం గోదావరి జిల్లాలో పెద్దగా పెరగడం లేదు. ఒక్క ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. మరో 20 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ జరుగుతోంది. సుమారు 1.50 లక్షల ఎకరాల్లో కోకోను అంతర పంటగా సాగు చేసేందుకు అవకాశమున్నా కనీసం పది వేల ఎకరాల్లో కూడా సాగు జరగకపోవడానికి దీనిని నోటిఫై చేయకపోవడమే కారణమని రైతులు చెబుతున్నారు.

అప్పుడే మరిన్ని ప్రయోజనాలు



కోకో పంటను ఉద్యాన పంటగా రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేయాలి. అప్పుడు రైతులకు పూర్తిస్థాయిలో రాయితీలు అందుతాయి. కనీస మద్దతు ధరకు, పంటల బీమాకు ఒక భరోసా దక్కుతుంది. ఈ పంట మరింత లాభసాటిగా మారితే రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతారు.

– ముత్యాల జమ్మి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ ఎల్త్ మెనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీహెచ్ఎం) సభ్యుడు, అంబాజీపేట

విద్యార్థి సంఘాల అణచివేతకే ఆ జీవో



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల, గురుకుల పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశించకుండా ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఆ సంఘాల అణిచివేతకు చేసిన కుట్రని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. అమలాపురంలోని పార్టీ జిల్లా శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాలయాల్లోకి విద్యార్థి సంఘాల ప్రతినిధులు వెళ్లేది రాజకీయాలకు కాదని, అక్కడి సమస్యల పరిష్కారానికేనని ఆయన గుర్తు చేశారు. విద్యా రంగంలో సమస్యలపై పోరాటాలు చేసే విద్యార్థి సంఘాలపై ఈ నిషేధం పెట్టడం దారుణమన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణేనని పేర్కొన్నారు. ఈ జీవో విద్యాభివృద్ధికి పూర్తిగా విరుద్ధమని అన్నారు. ఈ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు పితాని బేబీరావు, కొనుకు వెంకటేశ్వరరావు, సాధనాల రామకృష్ణ, యండమూరి శ్రీనివాస్, గానుగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

నాటు, లైసెన్సు లేని తుపాకులు ఉంటే నేరం

రాజమహేంద్రవరం రూరల్: నాటు, లైసెన్స్ లేని తుపాకులు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎవరి వద్దనైనా నాటు, లైసెన్సు లేని తుపాకులు, ఇతర మారణాయుధాలు ఉన్నట్టు గుర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎవరి వద్దనైనా ఆయుధాలుంటే వెంటనే వాటిని దగ్గరలోని పోలీస్ స్టేషన్లలో అందజేయాలని అన్నారు. అనుమానిత ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని, అక్రమ మారణాయుధాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మార్కెట్‌కు వరలక్ష్మీ కళ

- బంగారు రూపుల కొనుగోలు చేసిన మహిళలు
- పూలు, పండ్ల దుకాణాల వద్ద రద్దీ



అమలాపురం మార్కెట్‌లో పండ్ల దుకాణాల వద్ద రద్దీ

అమలాపురం టౌన్: జిల్లాలో వరలక్ష్మీ వ్రతాలను శుక్రవారం ఇంటింటా నిర్వహించేందుకు గృహిణులు గురువారం సాయంత్రానికే అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. వ్రతాలకు అవసరమైన పూజా సామగ్రిని సమకూర్చుకున్నారు. అమలాపురం, మండపేట, రామచంద్రపురం పట్టణాలతోపాటు ముమ్మిడివరం నగర పంచాయతీ, 22 మండల కేంద్రాల్లో మార్కెట్లు గురువారం లక్ష్మీ కళతో, వినియోగదారుల రద్దీతో కనిపించాయి. మహిళల సౌభాగ్యానికి వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో బంగారు దుకాణాలు మహిళా వినియోగదారులతో కిటకిటలాడాయి. మార్కెట్లు వరలక్ష్మీ వ్రత సామగ్రి దుకాణాలతో హడావుడిగా కనిపించాయి. బంగారు రూపు పెట్టుకుని మహిళలు వరలక్ష్మీ వ్రతమాచరించడం సంప్రదాయం. బంగారు రూపుల కొనుగోలుకు మహిళలు గోల్డ్ మార్కెట్ల బాట పట్టారు. దీంతో బంగారు దుకాణాల్లో గురువారం మహిళా వినియోగదారులే అధికంగా కనిపించారు.

పెరిగిన బంగారం ధరలు

గత ఏడాదితో పోల్చితే బంగారం ధరలు ఈ ఏడాది మరింతగా పెరిగిన ప్రభావం జిల్లాలోని గోల్డ్ మార్కెట్‌లపై పడింది. గత ఏడాది ఒక గ్రాము బంగారు రూపు రూ.7 వేలు ఉంటే ఈ ఏడాది అదే గ్రాము రూపు రూ.10 వేలు వరకూ ధర పలికింది. తులం బంగారం రూ.లక్షకు పైగా ధర చేరడంతో గత ఏడాదితో పోల్చుకుంటే బంగారు రూపుల వ్యాపారం అంతంత మాత్రంగానే జరిగిందని అమలాపురం బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. అమలాపురం గోల్డ్ మార్కెట్‌లో ఉన్న దాదాపు 300 బంగారం దుకాణాల్లో బంగారు రూపుల అమ్మకాలు సాగాయి.

పూలు, పండ్లు దుకాణాల్లో అమ్మకాల జోరు

వరలక్ష్మీ వ్రతాల కోసం మహిళలు పలు రకాల పూలు, పండ్లు కొనుగోలు చేశారు. బత్తాయి, ఆపిల్, దానిమ్మ, ద్రాక్ష పండ్లను కొనుగోలు చేశారు. అమలాపురం మార్కెట్లో అయితే రెగ్యులర్ పండ్ల దుకాణాలతో పాటు శ్రావణ శుక్రవారం కోసం రోడ్ల చెంత అనేక తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. పండ్ల కొనుగోలుకు రూ.500 నుంచి రూ.1000 వరకూ వెచ్చించారు. పూల కోసమైతే రూ.200 నుంచి రూ.500 వరకూ కేటాయించారు. స్వీటు దుకాణాల్లోనూ రద్దీ కనిపించింది.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం

- బాధ్యులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలి
- ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ డిమాండ్
- అమలాపురంలో జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, నాయకులు

అమలాపురం టౌన్: బడుగు, బలహీన వర్గాల నేతలపై కూటమి ప్రభుత్వం ఓ పథకం ప్రకారం దాడులు చేయిస్తూ రాష్ట్రంలో ఆ సామాజిక వర్గీయులపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. కడప జిల్లా పులివెందుల రూరల్ మండలంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాలు దాడి చేసి గాయపరిచిన ఘటనను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ ఆధ్వర్యంలో అమలాపురం మున్సిపల్ పిల్లల పార్కు వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ మాట్లాడారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, రాష్ట్ర వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్ యాదవ్‌పై జరిగిన దాడిని పార్టీ జిల్లా బీసీ నేతలు తీవ్రంగా ఖండించారు. రమేష్ యాదవ్‌తోపాటు ఇటీవల 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ' కార్యక్రమాలకు హాజరవుతున్న పార్టీకి చెందిన కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావులపై కూటమి ప్రభుత్వ నాయకులు దాడులు చేయడం దారుణమని పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ కారును ధ్వంసం చేయడమే కాకుండా ఆయనపై హత్యాయత్నం చేయడంలో కూటమి ప్రభుత్వం నిరంకుశ ధోరణి అవగతమవుతోందన్నారు. ఈ ముగ్గురి నేతలపై దాడులకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల నేతలపై కూటమి ప్రభుత్వం అనేక అరాచకాలకు పాల్పడుతూ విధ్వంసాలు సృష్టించడం చూస్తుంటే ఈ దాడులు ఆయా సామాజిక వర్గాలపై ప్రభుత్వం కక్ష కట్టి చేస్తున్నట్టు ఉందని స్పష్టం చేశారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరజాకుమారి, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు దొమ్మేటి సత్య మోహన్, పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, కట్టోజు సన్యాయ్యదాసు, పార్టీ నాయకులు కుడుపూడి భరత్ భూషణ్, భరణికాన బాబు, కుడుపూడి త్రినాథ్, విత్తనాల మూర్తి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. తొలుత మున్సిపల్ పిల్లల పార్కు వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే, హైకోర్టు మాజీ న్యాయమూర్తి బీఏ స్వామి విగ్రహాలకు ఎమ్మెల్సీలు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఇస్కాన్‌లో రేపటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకూ ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. స్వామి నిమయ హేమాంగ దాస్, స్వామి హేమంత్ దాస్, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ సాయంత్రం 4 గంటలకు విశ్వశాంతి యజ్ఞం, వాహన సేవలు, శ్రీకృష్ణుని లీలలపై ప్రవచనాలు, ఊంజల్ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. శ్రీకృష్ణా జన్మాష్టమిని పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీ ఉదయం 9 గంటలకు యజ్ఞసేవ, మధ్యాహ్నం ఒంటి గంటకు వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రదానం ఉంటాయన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఉట్టి ఉత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం, రాత్రి 10 గంటలకు రాధాకృష్ణులకు మహా కుంభాభిషేకం జరుగుతాయని తెలిపారు. ఇస్కాన్ సంస్థాపకాచార్యులు శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు ఆ స్వామి మూర్తికి అభిషేకం, అనంతరం ప్రవచనం జరుగుతాయన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి అందరికీ అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఇస్కాన్ ప్రతినిధులు

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన పది అంశాల్లో శనివారం నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో ఈ నెల 9న ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కబడ్డీ, ఖోఖో; 10న యాళ్ల సత్యనారాయణ భారతీయ వ్యాయామ కళాశాలలో వెయిట్ లిఫ్టింగ్; ఎస్‌కేవీటీ క్రీడా మైదానంలో బాక్సింగ్, బాస్కెట్ బాల్; ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, హాకీ, వాలీ బాల్; మోడల్ కాలనీ ఆర్చరీ అకాడమీలో ఆర్చరీ; నారాయణపురం కేఎస్ఎన్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నామని వివరించారు. బ్యాడ్మింటన్ పోటీలకు 19 ఏళ్ల లోపు వారు మాత్రమే అర్హులన్నారు. మిగిలిన క్రీడలకు 14 నుంచి 22 సంవత్సరాల లోపు వయస్సు వారు అర్హులని తెలిపారు. వివరాలకు 87126 22569 నంబరులో సంప్రదించాలని శేషగిరి సూచించారు.

ఆలయాల పాలక మండళ్లకు గ్రీన్ సిగ్నల్

– నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం

ఐ.పోలవరం: జిల్లాలో ప్రధాన ఆలయాల పాలక మండళ్ల నియామకానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో పాలక మండళ్ల నియామకాలుకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఆర్‌టీ నెం.859 జారీ చేసింది. జిల్లాలో రూ.5 కోట్ల నుంచి రూ.20 కోట్ల ఆదాయం పరిధిలోకి వచ్చి అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం పాలకవర్గానికి దరఖాస్తులను ఆహ్వానించింది. జీవో ఆర్‌టీ నెం.861 కూడా విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లా పరిధిలో రు.కోటి నుంచి రూ.5 కోట్ల ఆదాయం పరిధిలోకి వచ్చే ఆలయాల్లో కొత్త పాలకవర్గాల నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది అమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి, అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ, మురమళ్ళ శ్రీ వీరేశ్వరస్వామి, మందపల్లి మందేశ్వరస్వామి ఆలయ పాలకవర్గ నియామకాలు చేపట్టనుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ఉత్తర్వులలో పేర్కొంది. ప్రతి ఆలయ పాలక మండలి సభ్యులలో ఒకటి బ్రాహ్మణ, ఒకటి నాయీ బ్రహ్మణ వర్గాలకు కేటాయించారు. ఆలయం ఆదాయం రూ.రెండు లక్షల లోపు ఉంటే ఆ దేవాలయానికి మొత్తం ఏడుగురు సభ్యులను నియమించనున్నారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉండాల్సి ఉంది. ఓసీ కేటగిరిలో ముగ్గురు, ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ వర్గానికి చెందినవారు, ముగ్గురు బీసీలకు కేటాయించారు. రూ.రెండు లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆదాయం ఉన్న ఆలయాలకు 9 మంది పాలకవర్గ సభ్యులను నియమించనున్నారు. వీరిలో నలుగురు మహిళలు, నలుగురు ఓసీలు, ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ, నలుగురు బీసీలు సభ్యులుగా ఉంటారు. రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు ఆదాయం ఉన్న ఆలయాలకు 11 మంది సభ్యులను నియమించనున్నారు. వీరిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు ఐదు ఓసీ, ఇద్దరు ఎస్సీ లేదా ఎస్టీ వర్గానికి చెందినవారు, నలుగురు బీసీలకు ఇచ్చారు. రూ.కోటి నుంచి రూ.ఐదు కోట్ల వరకు ఆదాయం ఉన్న దేవాలయాలకు సైతం ఇదే విధానాన్ని అవలంబించనున్నారు. రూ.ఐదు కోట్ల నుంచి నుంచి 20 కోట్ల రూపాయల వరకు ఆదాయం ఉన్న ఆలయాలకు 13 మంది సభ్యులను నియమించనున్నారు. వీరిలో ఆరుగురు మహిళలు, ఓసీలకు 6 కేటాయించగా, ఎస్సీ ఎస్టీ వర్గాలకు రెండు, బీసీలకు 5 చొప్పున సభ్యులను కేటాయించారు. రూ.20 కోట్ల ఆదాయం దాటిన ఆలయాలకు 17 మంది సభ్యులను నియమించనున్నారు. ఎనిమిది మంది మహిళలు కాగా, ఎనిమిది మంది ఓసీలు, ఎస్సీ ఎస్టీ బీసీలకు 9 సభ్యులుగా నియమించనున్నట్టు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రూ.12 లక్షల విలువ చేసే రేషన్ బియ్యం స్వాధీనం

జగ్గంపేట: స్థానికంగా రెండు ప్రాంతాలలో రేషన్ బియ్యంతో వున్న మూడు వాహనాలను జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు గురువారం పట్టుకుని రూ.12 లక్షల విలువ చేసే 28 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి రాజు అధ్వర్యంలో జగ్గంపేట జేవీఆర్ సెంటర్‌లో ఒక వాహనాన్ని, బాలాజీ రైసు మిల్లు సమీపంలో రెండు వాహనాలను అధికారులు పట్టుకున్నారు. బియ్యాన్ని సివిల్ సప్లయిస్ గొడౌన్‌కు తరలించి, వాహనాలను జగ్గంపేట పోలీసులకు అప్పగించారు. ప్రత్తిపాడు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి టికీ వీరబాబు, నల్లము శెట్టి నారాయణ, వి.వెంకటరమణను అరెస్టు చేసినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. రెండు వాహనాలు కిర్లంపూడి మండలం జగపతినగరం నుంచి, మరో వాహనం యలమంచిలి నుంచి వచ్చినట్లు తెలిపారు.

గామన్ బ్రిడ్జి వద్ద..

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరులోని గామన్ బ్రిడ్జి వద్ద విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ తాతారావు సూచనలతో విజిలెన్స్ సీఐ గోపాలకృష్ణ బుధవారం తనిఖీలు నిర్వహించారు. దెందులూరు నుంచి రాజానగరం వెళుతున్న వాహనంలో 9,540 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని స్థానిక సివిల్ సప్లై డీటీ ఎం.సునీతకు అప్పజెప్పారు. బియ్యాన్ని ప్రభుత్వ గోడౌన్‌కు తరలించి, వాహనాన్ని కొవ్వు టౌన్ పోలీస్ స్టేషన్ అప్పగించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

‘నన్నయ’ విద్యార్థిని ఫిర్యాదుపై కేసు

రాజానగరం: రాజకీయ వైషమ్యాలతో తనను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని, రక్షణ కల్పించాలంటూ ఆదికవి నన్నయ యూనివర్సిటీకి చెందిన బయోటెక్నాలజీ విద్యార్థిని స్థానిక పోలీసులను ఆశ్రయించింది. యూనివర్సిటీలో పనిచేస్తున్న ఇద్దరు తాత్కాలిక అధ్యాపకుల నడుమ నెలకొన్న వివాదం నేపథ్యంలో తనను టార్గెట్ చేస్తున్నారని అడ్‌హాక్ ప్రొఫెసర్ కె.యామినీజ్యోత్స్నతోపాటు నలుగురు విద్యార్థినులపై ఫిర్యాదు చేసింది. ఈ విషయమై స్థానిక ఎస్సై నాగార్జునను వివరణ కోరగా ఆ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని, దర్యాప్తు జరుగుతోందన్నారు.

కేంబ్రిడ్జ్ ఎక్సలెన్స్ అవార్డుల్లో ఆదిత్యకు 3వ స్థానం



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న ఆదిత్య ప్రతినిధి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో 3వ స్థానం పొందినట్టు ప్రో చాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్ రాడిసన్‌లో జరిగిన కేంబ్రిడ్జ్ సమన్వయకర్తల వార్షిక సమావేశంలో ఈ అవార్డును ఆదిత్య యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ తెలుగు నీలిమ స్వీకరించినట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు అభ్యాసకుల అవసరాలకు అనుగుణంగా విజయవంతమైన, అనుకూలీకరించిన మాడ్యూల్ అమలుకు ఈ గుర్తింపు లభించినట్టు తెలిపారు. చాన్సలర్ ఎన్.శేషారెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్స్, డీన్స్, ఆనందం వ్యక్తం చేశారు.

ప్రయాణం.. ప్రయాసం

- దిండి- చించినాడ వంతెనపై రాకపోకలు నిషేధం
- ప్రత్యామ్నాయం చూపని అధికారులు
- విద్యార్థులకు నడక యాతన
- ట్రక్కుల పైనే కార్మికుల ప్రయాణం
- ఇంకా మొదలు కాని మరమ్మతులు
- అంచనాలు కూడా రూపొందించని వైనం



దిండి- చించినాడ వంతెనపై ఎండలో నడుస్తున్న విద్యార్థులు



ట్రక్‌పై ప్రయాణిస్తున్న కార్మికులు

మలికిపురం: రెండు జిల్లాల మధ్య గోదావరి నదిపై గల దిండి- చించినాడ వంతెనపై రాకపోకలు నిషేధించిన ప్రభుత్వం ప్రయాణికులకు తగిన ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలం అయింది. సుమారు 3 నెలల పాటు రాకపోకలు నిషేధం అంటూ పది రోజుల క్రితం ప్రకటించిన అధికారులు విద్యార్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోలేదు. వంతెన మరమ్మతులకు నిధులు కేటాయింపుపై కూడా దృష్టి పెట్టలేదు. సుమారు 20 ఏళ్లుగా ఇక్కడ వంతెనపై రాకపోకలకు అలవాటు పడిన ప్రయాణికులు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ప్రధానంగా ఇక్కడ విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలలోని రాజోలు దీవి నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలో గల విద్యాసంస్థలకు అనేక బస్సులు తిరుగుతున్నాయి. ఈ దీవి నుంచి సుమారు 3 వేలకు పైగా విద్యార్థులు బస్‌లలో విద్యాసంస్థలకు వెళ్తారు. సుమారు 100కు పైగా బస్‌లు ఉన్నాయి. అయితే వంతెనపై రాకపోకలు నిలిపివేయడంతో ఆయా విద్యా సంస్థలు బస్‌లను దిండి వైపే నిలిపి వేస్తున్నాయి. సుమారు 2 కిలోమీటర్ల పొడవు గల వంతెనపై విద్యార్థులు నడుచుకుంటూ చించినాడ వైపు వెళ్తున్నారు. సాయంత్రం కూడా చించినాడ వరకే బస్‌లు నడుపుతున్నారు. అటువైపు నుంచి విద్యార్థులు నడుస్తునూ ఇవతలి వైపునకు వస్తున్నారు. ఇలా ఉదయం, సాయంత్రం నడక విద్యార్థులకు భారంగా మారింది. ఎండ కూడా తీవ్రంగా ఉండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

పట్టించుకోని విద్యాసంస్థలు

తేలిక పాటి వాహనాలకు అనుమతి ఉండడంతో ఆయా విద్యాసంస్థలు ఆటోలను ఏర్పాటు చేయవచ్చు. కానీ అలా చేయడంలేదు. ఫీజులు దండీగా వసూలు చేసే ఆయా విద్యాసంస్థలు ఇలా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్‌లు అటువైపు, ఇటువైపు కూడా నిలిపి వేసి ప్రయాణికులకు వంతెనపై నడకే దిక్కు అంటున్నారు. ప్రయివేటు బస్‌లు కూడా చించినాడ వరకే పరిమితం కావడంతో మలికిపురం, రాజోలు, అమలాపురం నుంచి వచ్చే బస్‌లు నిలిచిపోయాయి. దీంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులను రాజోలు దీవి నుంచి మోటార్ సైకిళ్లపై చించినాడ తీసుకెళ్లవలసి వస్తోంది. ఇక ఉపాధి కోసం అటు నుంచి వచ్చి వెళ్లే కార్మికులు ట్రక్కులను ఆశ్రయిస్తున్నారు. ఇదిలా ఉంటే వంతెనకు ఇరువైపులా భారీ వాహనాలు, బస్‌లు నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్ సమస్య కూడా అధికంగా ఉంది. ఈ కష్టాలు ఎన్నాళ్లు ఉంటాయో అని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం



దిండి వంతెనపై బస్‌ల రాకపోకల నిషేధించడం వల్ల విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యా సంస్థల బస్‌లు వంతెన అటు వైపు, ఇటు వైపు నిలిపివేసి వంతెనపై విద్యార్థులను నడిపిస్తున్నారు. ఆటోలు పెట్టి ఇబ్బందులను తొలగించాలి, అధికారులు జోక్యం చేసుకోవాలి.

– బూశి జాన్ మోషే, విశ్వేశ్వరాయపురం.

ఏటీఎం దగ్ధం కేసులో నిందితుల అరెస్ట్

యానాం: యానాం న్యూబస్టాండ్ సమీపంలో గత నెల 8వ తేదీన స్టేట్‌బ్యాంక్ ఏటీఎం దగ్ధం కేసులో నిందితులను గురువారం యానాం క్రైమ్‌టీమ్ పట్టుకుందని ఇన్‌చార్జి ఎస్పీ అడలరసన్, ఎస్సైలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు విలేకరులకు తెలిపారు. గత నెల 8వ తేదీన తెల్లవారుజామున స్థానిక న్యూబస్టాండ్ సమీపంలో కంచర్ల కాంప్లెక్స్‌లో స్టేట్‌బ్యాంక్ ఏటీఎంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఏటీఎం ఇన్‌చార్జి చినబాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. మొదట్లో అగ్నిప్రమాదమని అనుకున్నప్పటికి కావాలనే దగ్ధం చేశారని పోలీసులకు కీలకమైన ఆధారాలు లభ్యం కావడంతో ఎస్సై పునీత్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్రైమ్ టీమ్‌ను ఇన్‌చార్జి ఎస్పీ అడలరసన్ ఏర్పాటు చేశారు. ఏటీఎంలో క్యాష్ డిపాజిట్ చేసిన యువకులే ఈ ఘటనకు కారణమని తెలిసింది. ఈ నేపథ్యంలో ఏటీఎం దగ్ధం చేసిన యువకులైన కుయ్యేరుకు చెందిన వెంకటేష్ అలియాస్ బిట్టు, చలివేంద్రపాడుకు చెందిన అనిల్‌బాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు ఏటీఎంలో డిపాజిట్ చేయాల్సిన క్యాష్‌లో సుమారు రూ.12 లక్షల వరకు దశలవారీగా సొంతానికి రెండేళ్లుగా వాడేసుకున్నారు. తిరిగి ఆ సొమ్మును డిపాజిట్ చేయలేకపోవడంతో ఏటీఎంను దగ్ధం చేస్తే సొమ్ము గురించి ఎవరికీ తెలియదని అనుకుని పథకం ప్రకారం పెట్రోలును తీసుకువచ్చి ఏటీఎంను దగ్ధం చేశారు. నిందితుల నుంచి కారు, సెల్‌ఫోన్, బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. క్రైమ్‌టీమ్ సభ్యులను పోలీసు అధికారులు అభినందించారు.

లారీ బోల్తా పడి డ్రైవర్ మృతి



గొల్లగూడెం వద్ద బోల్తా పడిన లారీ



మృతి చెందిన డ్రైవర్ శివనాగరాజు (ఫైల్)

దేవరపల్లి: విశాఖపట్నం నుంచి కరీంనగర్ జిప్సమ్ లోడుతో వెళుతున్న లారీ దేవరపల్లి మండలం గొల్లగూడెం వద్ద ఎదురుగా వస్తున్న గూడ్స్ వాహనాన్ని ఢీ కొని అదుపుతప్పి రోడ్డు పక్కన గల చెరువులోకి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం తాడిగడప డొంకరోడ్డు, ఇందిరానగర్‌కు చెందిన లారీ డ్రైవర్ తాటిపర్తి శివనాగరాజు(29) లారీ క్యాబిన్‌లో చిక్కుకుని మృతి చెందాడు. స్థానికుల సహాయంతో డ్రైవర్ మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. డ్రైవర్ కుడి చెయ్యి తెగిపడింది. పోలీసుల కథనం ప్రకారం విశాఖపట్నం నుంచి కరీంనగర్‌కు జిప్సమ్(మట్టి) లోడుతో వెళుతున్న లారీ గురువారం తల్లాడ–దేవరపల్లి హైవేలో గోపాలపురం–దేవరపల్లి మధ్య గల గొల్లగూడెం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరొక గూడ్స్ వాహనాన్ని వెనుకు పక్కన ఢీ కొంది. లారీ అతివేగంగా రావడంతో అదుపుతప్పి సమీపంలోని చెరువు గట్టున గల హెచ్‌టీ విద్యుత్ లైన్ స్తంభాన్ని ఢీ కొని బోల్తాపడింది. ఆ సమయంలో ఎదురుగా రోడ్డుపై ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో డ్రైవర్ శివనాగరాజు మృతి చెందినట్టు ఎస్సై వి.సుబ్రహమణ్యం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గోదావరి స్నానానికి వెళ్లి వస్తూ...

- రోడ్డు ప్రమాదంలో ఏడేళ్ల చిన్నారి మృతి
- మూడేళ్ల బాలుడి పరిస్థితి విషమం
- బైక్‌ను సిలిండర్ల లోడు లారీ ఢీకొట్టడంతో ఘటన



మృతురాలు షణ్ముఖి (ఫైల్)

గోకవరం: వరలక్ష్మీ పర్వది నాన్ని పిల్లలతో కలిసి సంతోషంగా గడపాలని ఆ కుటుంబం అనుకుంది. ఇందుకోసం పిల్లలతో కలిసి రాజమహేంద్రవరంలో గోదావరి స్నానానికి వెళ్లారు. తిరిగి తమ గ్రామానికి వస్తుండగా గ్యాస్ సిలిండర్ల లారీ రూపంలో అనుకోని ఉపద్రవం ఎదురై కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. గోకవరం మండలం బావాజీపేట గ్రామ శివారున గురువారం మధ్యాహ్నం బైక్‌ని గ్యాస్ సిలిండర్ల లోడు లారీ ఢీకొన్న ప్రమాదంలో ఏడేళ్ల బాలిక మృతి చెందగా, మూడేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు.

గోకవరం మండలం కామరాజుపేట దుళ్ల వీధికి చెందిన పండూరి రాంబాబు ఇటుకబట్టీలో పని చేస్తున్నాడు. అతనికి భార్య వరలక్ష్మి, కుమార్తె షణ్ముఖి (7), మూడేళ్ల బాలుడు పూర్ణకిరణ్‌తేజ ఉన్నారు. శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని గోదావరి స్నానం చేయాలని భార్యాభర్తలు కుమార్తె, కుమారుడితో కలిసి బైక్‌పై ఉదయం రాజమహేంద్రవరం వెళ్లారు. స్నానం ముగించుకుని వ్రతానికి కావాల్సిన పూజా సామగ్రి కొనుగోలు చేసి సంతోషంగా తిరిగి వస్తుండగా మధ్యాహ్నం సమయంలో బావాజీపేట శివారున పోలవరం వంతెన సమీపంలో ఎదురుగా వస్తున్న గ్యాస్ సిలిండర్ల లారీ వీరి బైక్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమార్తె షణ్ముఖి, కుమారుడు పూర్ణకిరణ్‌తేజల తలకు తీవ్ర గాయాలయ్యాయి. తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఓ ప్రైవేటు వాహనంలో వారిని గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో ఆక్కాతమ్ముళ్లను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలిక షణ్ముఖి మృతి చెందింది. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై గోకవరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక మృతితో కామరాజుపేటలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలిక స్థానికంగా ఒక ప్రైవేటు స్కూల్‌లో చదువుకుంటోంది. చదువులో ఎంతో చలాకీగా ఉండే బాలిక అర్ధంతరంగా తనువు చాలించడంతో విషాదం నెలకొంది. కళ్లముందే తమ చిన్నారులకు ఈ పరిస్థితి తలెత్తడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

మట్టి, చెట్లు మాయం



చెరువు మట్టిని లారీలలో ఇటుక బట్టీలకు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

- గోపాలపురం బొల్లేరు చెరువులో నీటి సంఘం నిర్వాకం
- అంతా టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే..
- పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటున్న అధికారులు



గోపాలపురం బొల్లేరు చెరువు గట్టుపై చెట్టును నరికివేయడంతో మిగిలిన మోడు



లారీల రాకపోకలతో దెబ్బతిన్న చెరువు గట్టు

గోపాలపురం: గ్రామంలో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బొల్లేరు చెరువులో ఉన్న మట్టిని టీడీపీ నాయకులు తరలించడంతో పాటు గట్టుపై ఉన్న అత్యంత విలువైన చెట్లను నరికివేశారు. నీటి సంఘం ముసుగులో తాత్కాలిక తీర్మానం చేసి ఇరిగేషన్ అధికారులకు కనీసం సమాచారం లేకుండా రూ.లక్షా 50వేలకు అమ్ముకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెలలో చెరువులో ఉన్న లక్షలాది రూపాయల మట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇదంతా టీడీపీ నాయకులు కనుసన్నలోనే జరిగిందన్నది బహిరంగ రహస్యం. గోపాలపురం మండలంలోని గంగోలు, భీమోలు, నందిగూడెం, జగన్నాథపురం, కరిచర్లగూడెం గ్రామాల్లోని చెరువుల్లోని మట్టిని ఆయా గ్రామ టీడీపీ నాయకులు నియోజకవర్గ ముఖ్యనాయకుడికి 70 శాతం వాటాగానూ, మిగిలిన 30శాతం వాటా స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు పంచుకొనే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే చెరువు మట్టిని తరలించి అమ్ముకున్న సొమ్ము మొత్తం 100 శాతం నియోజకవర్గ ముఖ్య నాయకుడికి అందజేయాలని ఆ తర్వాత మాత్రమే నాయకులకు 30శాతం అందజేస్తామని చెప్పినట్లు సమాచారం. అయితే మొత్తం 100శాతం అప్పగించడానికి ఆయా గ్రామాల టీడీపీ నాయకులు సుముఖంగా లేకపోవడంతో ఇప్పటికే 30 శాతం వాటా సొమ్మును ఆయా గ్రామాల నాయకులు వాడుకున్నారు. ఎన్నికల సమయంలో మా గ్రామంలో ప్రతి కార్యక్రమానికి తమ సొంత సొమ్ము ఖర్చు చేశామని, కనీసం 30శాతం వాటా కూడా ఇవ్వకపోతే పార్టీ కార్యక్రమాలు ఎలా నిర్వహించాలంటూ కొంతమంది టీడీపీ నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో మా భాగస్వామ్యం ఉన్నా కనీసం చెరువు అక్రమ మట్టి తవ్వకాలు కానీ, ఇతర కార్యక్రమాలు కానీ తెలియజేయడం లేదని ఒక పక్క జనసేన, బీజేపీ నాయకులు మథన పడుతున్నారు.

దీనిపై ఇరిగేషన్ ఏఈ, డీఈ కె.రవీంద్ర, రాహుల్ భాస్కర్‌లను వివరణ కోరగా చెరువుల్లోని మట్టిని రైతులు తమ పంట పొలాలకు తీసుకెళ్లడానికి అనుమతులు ఇచ్చామని కానీ ఆ మట్టిని ఇటుక బట్టీలకు తరలించినట్లు మాకు సమాచారం రావడంతో నిలుపుదల చేశామన్నారు. బొల్లేరు చెరువు గట్టుపై విలువైన వేప, ఇతర జాతుల చెట్లు నకరడం మా దృష్టికి వచ్చిందని దానిపై జిల్లా ఉన్నతాధికారులకు, స్థానిక పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

షాపులపైకి దూసుకు వెళ్లిన లారీ

- టీ స్టాల్ నిర్వాహకుడి మృతి
- నాలుగు షాపులు ధ్వంసం



ప్రమాదంలో మృతి చెందిన త్రిమూర్తులు (ఫైల్)



పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్లో షాపుల పైకి దూసుకువెళ్లిన లారీ

పి.గన్నవరం: ఆర్‌పీ రోడ్డులో గురువారం తెల్లవారు జామున కోళ్ల లోడుతో వేగంగా వస్తున్న లారీ స్థానిక మూడు రోడ్ల సెంటర్లో షాపులపైకి దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో టీ స్టాల్ నిర్వాహకుడు మృతి చెందగా, నాలుగు షాపులు ధ్వంసమయ్యాయి. లారీ డ్రైవర్ కునుకు తీయడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. అక్కడ టీ అమ్మకాలు ప్రారంభమైతే ప్రాణ నష్టం ఎక్కువ ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

గ్రామానికి చెందిన వాసంశెట్టి త్రిమూర్తులు (57) కొన్నేళ్లుగా స్థానిక సెంటర్లో వంతెన కింద టీ షాపు నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఆక్రమణలు తొలగింపులో భాగంగా అతని టీ స్టాల్‌ను తొలగించారు. పది రోజుల క్రితం వంతెనకు ఎదురుగా ఉన్న షాపులో టీ స్టాల్‌ను మళ్లీ ప్రారంభించాడు. గురువారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో టీ స్టాల్‌ను తెరచేందుకు బరకాలు తొలగిస్తుండగా ఏలూరు నుంచి రాజోలుకు కోళ్ల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి షాపులపైకి దూసుకు వచ్చింది. అక్కడే ఉన్న త్రిమూర్తులును లారీ వేగంగా ఢీకొట్టడంతో 20 మీటర్ల దూరంలో రోడ్డుపై ఎగిరిపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో అతడిని 108 అంబులెన్స్‌లో అమలాపురంలోని ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా దారిలో మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి అమలాపురం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. త్రిమూర్తులు మృతితో భార్య, కుమారులు, బంధువులు భోరున విలపించారు. అతడి మృతికి సంతాపంగా వర్తక సంఘం ఆధ్వర్యంలో ఉదయం పి.గన్నవరంలో షాపులు మూసివేసి బంద్ పాటించారు. త్రిమూర్తులు మృతదేహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టీ స్టాల్ ప్రారంభమైతే పెద్ద ప్రమాదం జరిగేది

స్థానిక మూడు రోడ్ల సెంటర్లో త్రిమూర్తులు టీ స్టాల్‌ను తెల్లవారు జామున తీస్తారు. ఉదయం వరకూ టీస్టాల్ వద్ద ఎక్కువ మంది నిల్చొని ఉంటారు. షాపు ప్రారంభించిన తర్వాత ఈ లారీ దూసుకు వచ్చుంటే ఎక్కువ ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. లారీ దూసుకు రావడంతో ఒక కూల్ డ్రింక్ షాపు, టీస్టాల్, వస్త్ర దుకాణం, కాఫీ హోటల్ ధ్వంసం అయ్యాయి.

ఆచూ“కీ” ఇచ్చిన టోల్ ఫీజు

- లారీ చోరీ కేసులో నిందితుల గుర్తింపు
- కేసు దర్యాప్తు ముమ్మరం

పిఠాపురం: టోల్ ఫీజు చెల్లింపు లారీ చోరీ కేసు దర్యాప్తులో కీలకంగా మారింది. పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయం వద్ద నివాసముంటున్న డి.అప్పారావు రాజులుకు చెందిన లారీ మంగళవారం రాత్రి చోరీకి గురయిన సంగతి తెలిసిందే. బుధవారం తెల్లవారుజామున లారీ చోరీకి గురయిన విషయం తెలుసుకున్న యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఫాస్టాగ్ ద్వారా టోల్ ఫీజు కట్ అయి లారీ యజమానికి మెసేజ్ రావడంతో కేసు దర్యాప్తులో టోల్ ఫీజు చెల్లింపు కీలకంగా మారినట్లు సమాచారం. లారీ కత్తిపూడి వైపు వెళ్లినట్టుగా నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఆ దిశగా బృందాలతో గాలింపు చేపట్టడంతో బుధవారం ఉదయానికి తుని సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారి పక్కన లారీ నిలిపి ఉంచడం గమనించారు. అయితే లారీలో ఉండాల్సిన ఆయిల్ లోడు మాత్రం లేకుండా ఖాళీగా ఉండడంతో లోడు దొంగిలించి లారీ వదిలి వెళ్లినట్లుగా పోలీసులు గుర్తించారు. కత్తిపూడిలోనే లారీ నుంచి ఆయిల్ లోడును తీసి వేరే వాహనాల్లో తరలించినట్లుగా గుర్తించిన పోలీసులు ఎక్కడకు తరలించారన్న విషయంపై దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లుగా తెలిసింది. ఇప్పటికే లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు చోరీకి గురయిన ఆయిల్‌ను దానిని తరలించడానికి ఉపయోగించిన ఇతర వాహనాలను గుర్తించి ఇతర వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. త్వరలో నిందితులను పట్టుకుంటామమని పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు.

బాలికను మోసగించిన యువకుడిపై పోక్సో కేసు

కాకినాడ రూరల్: మత్స్యకార గ్రామం సూర్యారావుపేటకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని మోసం చేసిన పూరికి చెందిన యువకుడు కుక్కల దుర్యోధనుడుపై సర్పవరం పోలీసులు పోక్సో చట్టం ప్రకారం గురువారం కేసు నమోదు చేశారు. సీఐ పెద్దిరాజు వివరాల ప్రకారం బాలిక సుమారు 8నెలల క్రితం తన బంధువుల ఇంటికి ఒడిశాలోని పూరి వెళ్లింది. అక్కడ దుర్యోధనుడుతో పరిచయం ఏర్పడింది. బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి జనవరి నెలలో రమణయ్యపేటలో ఒక లాడ్జిలో కలిశాడు. అప్పుడు తీసుకున్న ఫొటోలతో మళ్లీ కలుద్దామని వేధింపులకు పాల్పడుతుండడంతో బాలిక చేసిన ఫిర్యాదు మేరకు సీఐ పెద్దిరాజు కేసు నమోదు చేశారు. గురువారం ఆ లాడ్జి వద్దకు చేరుకుని పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు.

రేపటి నుంచి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ఆగస్టు 9 నుంచి 11వరకూ సీబీఎస్‌ఈ క్లస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్ సీహెచ్. విజయప్రకాష్ తెలిపారు. పోటీలు మూడు విభాగాల్లో ఉంటాయని, అండర్–14, 17, 19 నిర్వహిస్తారని, ఏపీ, తెలంగాణకు చెందిన సీబీఎస్‌ఈ స్కూల్స్ నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	6,000
ఒక కిలో	400

• విఛత్రం



వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రం నీలాకాశ కాంతులతో కొత్త అందాన్ని సంతరించుకుంది. వాతావరణ మార్పులతో ఆకాశమే ఆ క్షేత్రానికి ఛత్రము (గొడుగు) పట్టినట్టు కనిపించింది. గురువారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

– కొత్తపేట